సాక్షి
మంచిర్యాల
బుధవారం, 23, జూలై, 2025



'నవోదయ'లో క్రీడల సంగ్రామం

కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం నుంచి క్లస్టర్ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లాల్లోని క్రీడాకారులు పాల్గొంటారు. 8లో▸



'వసతి' నిరుపయోగం 9లో▸

తాండూర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహం నిరుపయోగంగా మారింది. చిన్నపాటి మరమ్మతులూ చేయించక శిథిలావస్థకు చేరి అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /26.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

బెల్లంపల్లి మున్సిపాలిటీలో సమస్యలా..!

- మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్



బెల్లంపల్లి కమిషనర్ తన్నీరు రమేష్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి 'సాక్షి' ముందుకొచ్చింది. గురువారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. మీ పరిధిలో నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి పరిష్కారం కోరవచ్చు. మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ ఫోన్ ఇన్ కార్యక్రమంలో అందుబాటులో ఉంటారు.

సమయం:
గురువారం (తేదీ 24-07-2025)
ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు :
9849905887, 9701909596

న్యూస్‌రీల్

నిలకడగా విద్యార్థినుల ఆరోగ్యం



విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతిగృహం విద్యార్థినులు బి.తరుణి జ్వరం, బి.రేవతి ట్రాన్సిలైటిస్‌తో కూడిన జ్వరంతో బాధపడుతున్నారని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న వారిని కలెక్టర్ మంగళవారం కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కొందరు ఉద్దేశ్య పూర్వకంగా విద్యార్థినులు కలుషిత ఆహారం తినడం వల్లనే ఇలా జరిగిందనే అవాస్తవాలను ప్రచారం చేసి గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. విద్యార్థినులు జ్వరంతో బాధపడుతున్నారని, వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఆర్ఎంవో శ్రీధర్, వైద్యులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం లక్ష సంతకాల సేకరణ



లక్ష సంతకాల సేకరణకు ర్యాలీగా బీసీ నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో లక్ష సంతకాల సేకరణ చేపట్టారు. మంగళవారం హాజీపూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం సంతకాల సేకరణకు ర్యాలీగా బయల్దేరారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ చేసి బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలు, చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 40 ఏళ్లుగా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమాలు చేపడుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. అగ్రకులాల రిజర్వేషన్లకు ఐదు రోజుల్లోనే రాజ్యాంగ సవరణ చేసి చట్టబద్ధత కల్పించారని గుర్తు చేశారు. రిజర్వేషన్లు కల్పించని పక్షంలో దశలవారీ ఆందోళనలు చేపడుతామని తెలిపారు. బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు గజెల్లి వెంకటయ్య, శాఖపూరి భీంసేన్, శేక్ సల్మాన్, నితీశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డులకు దళారులు

- కార్డులు ఇప్పిస్తామని వసూళ్లు
- మీ సేవల్లోనూ అదనంగా చెల్లింపులు
- 'కోడ్'కు ముందే కార్డులు పొందాలని ప్రయత్నాలు



ఆహార భద్రత కార్డు
తెలంగాణ ప్రభుత్వం
ఆహార, పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాలు
HOME
FSC Ration Card Search
Search
RATION CARD DETAILS
New Ration Card No : | FSC Reference No. : | Card Type : | Application Status :
Application No : | SKS Form No : | Office Name : | FPShop No :
Head of the Family : | District : | IMPDS Status :
Gas Connection : | Consumer No : | KeyRegister Sl.No : | Old RCNo :

కొత్త కార్డుల వివరాలు	మొత్తం అర్జీలు :	ఆమోదించినవి :	పంపిణీ చేసినవి :
	32,876	28,672	7,658

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రేషన్‌కార్డులకు దళారుల బెడద తప్పడం లేదు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారు ఎలాగైనా తమకు కార్డు రావాలని ప్రయత్నాలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి మరీ చేయించుకుంటున్నారు. మీ సేవ కేంద్రాల నుంచి తహసీల్దార్ కార్యాలయం దాకా కొందరు మధ్యవర్తులు తామే కార్డులు చేయిస్తామని చెబుతున్నారు. ఇక కొందరు స్థానిక నాయకులు సైతం కొత్తకార్డులు ఇప్పిస్తామని తిరుగుతున్నారు. ఆహార భద్రత కార్డులో లబ్ధిదారుల పేర్ల జోడింపు, తొలగింపులు సులువుగానే అవుతున్నాయి. అయితే నూతనంగా కార్డుల జారీ మాత్రం జాప్యం జరుగుతోంది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకోవాల్సి ఉంటుంది. ఓ వైపు రెవెన్యూ అధికారులు భూభారతి దరఖాస్తుల పరిశీలనలో బిజీగా ఉండగా, మరోవైపు రేషన్‌కార్డుల జారీ చేయాల్సి వస్తోంది. దీంతో కొత్త దరఖాస్తుల పరిశీలనలో ఆలస్యమవుతోంది. ఇక మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు కోసం రూ.45తీసుకోవాల్సి ఉండగా, రూ.వంద వరకు తీసుకుంటున్నారు.

కోడ్ వస్తుందనే అప్రమత్తం

స్థానిక సంస్థల ఎన్నికలకు కోడ్ వస్తే రేషన్‌కార్డుల పంపిణీ ఆగిపోతోందనే ముందు జాగ్రత్తతో కొత్త కార్డుల కోసం అప్రమత్తం అవుతున్నారు. ఈ నెల చివరిలో పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్, కార్పొరేషన్ల ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. దీంతో కార్డుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాల అమలు కోసం రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకోవడంతో అందరూ కార్డు తీసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక సన్నబియ్యం పంపిణీతోనూ రేషన్ కార్డుల కోసం డిమాండ్ పెరిగింది.

మళ్లీ మళ్లీ అర్జీలు

కొందరు తమకు కార్డు రాలేదని మళ్లీ మళ్లీ దరఖాస్తులు ఇస్తున్నారు. గతంలో ప్రజాపాలనలో వేలాది దరఖాస్తులు ఇచ్చారు. ఆ తర్వాత పరిశీలన చేసి గ్రామసభల్లో అర్హులను ప్రకటించడంతో నిరసనలు వచ్చాయి. తర్వాత మళ్లీ గ్రామసభల్లో అర్జీలు తీసుకున్నారు. చివరకు మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వారికే ఇస్తుండడంతో అందరూ మీ సేవల్లో దరఖాస్తులు ఇస్తున్నారు. ఒకసారి తిరస్కరిస్తే కూడా మరోసారి దరఖాస్తు చేసుకుంటున్నారు. అధికారులు అర్హుల గుర్తింపు కోసం '360-డిగ్రీ పోర్టల్'(సమగ్రం) చూస్తూ వారి వివరాలు సేకరిస్తున్నారు. పౌరుల ఆదాయ, ఆస్తులు, ఆర్థిక స్థితులు, ఉద్యోగ, ఉపాధి వివరాలు ఈ పోర్టల్‌తో తెలిసిపోతున్నాయి. దారిద్ర్య రేఖ దిగువన ఉన్న వారిని గుర్తించి కార్డులు జారీ చేస్తున్నారు. అయితే చాలామందికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త కార్డులు నిలిచిపోతాయి. కానీ ఎలాగైనా కార్డు పొందాలనే ఆశతో దళారులను ఆశ్రయిస్తున్నారు. సింగరేణి కార్మికులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్థికంగా ఉన్నవారు సైతం కార్డుల కోసం తిరుగుతున్నారు. దీంతో కొంత ఖర్చు చేసుకుని రేషన్‌కార్డు పొందాలనే ఆరాటంతో ఉన్నారు. మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసిన దరఖాస్తులతో తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి అక్కడ అధికారులతో పనులు చేయించుకుంటున్నారు.

కుండపోత.. ఉక్కపోత



జిల్లా కేంద్రంలోని లక్ష్మి టాకీస్ చౌరస్తా వద్ద భారీ వర్షంతో రోడ్లపై చేరిన నీరు



భారీ వర్షం కురిసిన తర్వాత పొడిబారిన వాతావరణం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భిన్నమైన వాతావరణం ఏర్పడింది. అప్పుడే ఎండ.. అప్పుడే వర్షంతో వాతావరణం మారిపోయింది. మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి, నస్పూర్, హాజీపూర్ మండలాల్లో పది నుంచి పదిహేను నిమిషాలపాటు భారీ వర్షం తర్వాత గంటన్నరపాటు పొడిబారిన వాతావరణం, భరించలేని ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. ఇలా రోజంతా భిన్న వాతావరణంతో ఓ వైపు వర్షం.. మరోవైపు పొడి వాతావరణంతో ఉక్కపోత, గాలిలో తేమ శాతం పెరిగిపోవడంతో బయట ఉండలేని పరిస్థితి ఎదురైంది. ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వినియోగం పెరిగింది.

జిల్లాలో 17.3 మిల్లీమీటర్ల వర్షపాతం

జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు 17.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. నస్పూర్ మండలంలో 55.3 మిల్లీమీటర్లు, మంచిర్యాలలో 46.2, హాజీపూర్‌లో 36.2, లక్సెట్టిపేటలో 24, జైపూర్‌లో 24.1, భీమారంలో 22.7, భీమినిలో 15.4, కన్నెపల్లిలో 13.5, కాసిపేటలో 10.8, తాండూర్‌లో 10.5, చెన్నూర్‌లో 10.1, మందమర్రిలో 11.6, నెన్నెలలో 9.9, దండేపల్లిలో 6.6, జన్నారంలో 6.6, వేమనపల్లిలో 3.3, బెల్లంపల్లిలో 5, కోటపల్లిలో 1.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సాధారణ వర్షపాతం 380.4 మిల్లీమీటర్లు కాగా ఇప్పటివరకు 209.7 మిల్లీమీటర్లు కురిసింది. జిల్లా సగటున 45శాతం లోటుగా నెలకొంది. భీమిని మండలం మినహా అన్ని మండలాల్లో లోటు వర్షపాతం నెలకొంది.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

జైపూర్: మండల కేంద్రం జైపూర్‌తోపాటు రసూల్‌పల్లి, ముదిగుంట, మిట్టపల్లి, ఇందారం, టేకుమట్ల, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, వేలాల, పౌనూర్, శివ్వారం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వేలాల గ్రామంలో పిడుగుపాటుకు కొలుదైతు పంచిక మల్లేశ్‌కు చెందిన ఎద్దు మృతిచెందింది. రూ.50వేలు నష్టం ఏర్పడిందని వాపోయాడు. ఇదే వేలాలలో తాటివనంపై పిడుగు పడి మంటలు చెలరేగాయి.

రైళ్ల రాకపోకలకు అంతరాయం

- 24 నుంచి 27వరకు ఇంటర్ లాకింగ్ పనులు
- తాత్కాలికంగా కొన్ని, పాక్షికంగా మరికొన్ని రైళ్లు రద్దు



బెల్లంపల్లి రైల్వేస్టేషన్

బెల్లంపల్లి: పెద్దపల్లి రైల్వే జంక్షన్ శివారులో నిర్మిస్తున్న బైపాస్ రైలుమార్గం ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టడానికి ఈ నెల 24నుంచి 27వరకు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడనుంది. బల్లార్షా-కాజీపేట మార్గంలో రాకపోకలు సాగించే పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే శాఖ పూర్తిగా, మరికొన్ని తాత్కాలికంగా, ఇంకొన్ని పాక్షికంగా రద్దు చేసింది.

రద్దయినవి ఇవే..

కరీంనగర్-సిర్పూర్(టీ)-కరీంనగర్ మెము ఎక్స్‌ప్రెస్, రామగిరి మెము ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 25నుంచి 27వరకు రద్దు చేశారు. బల్లార్షా-కాజీపేట-బల్లార్షా ఎక్స్‌ప్రెస్ 24నుంచి 26వరకు ఎగువ మార్గంలో బల్లార్షా వైపు, 25నుంచి 27వరకు దిగువ మార్గంలో కాజీపేట వైపు రద్దయింది. సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 25నుంచి 27వరకు తాత్కాలికంగా రద్దు చేశారు.

పాక్షికంగా రద్దయినవి..

హైదరాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్-బీదర్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, భద్రాచలం రోడ్-బల్లార్షా-భద్రాచలం రోడ్డు వరకు రాకపోకలు సాగించే సింగరేణి మెము ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25నుంచి 27వరకు, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఎగువ మార్గంలో 24నుంచి 26వరకు, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ దిగువ మార్గంలో 25నుంచి 27వరకు పాక్షికంగా రద్దు చేశారు.

ఆలస్యంగా నడిచేవి..

పెద్దపల్లి జంక్షన్ వద్ద రైల్వే బైపాస్‌ను అందుబాటులోకి తేవడానికి కొన్ని రైళ్లను ప్రారంభ స్టేషన్ నుంచి నిర్దేశించిన సమయం కంటే కొన్ని గంటలు ఆలస్యంగా బయల్దేరనున్నాయి.

- తిరుపతి-కరీంనగర్ బైవీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26న తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి రాత్రి 8.05గంటలకు బయల్దేరాల్సి ఉండగా 2.30గంటలు ఆలస్యంగా రాత్రి 10.35గంటలకు బయల్దేరుతుంది.
- న్యూఢిల్లీ నుంచి నాంపల్లి తెలంగాణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 24న దక్షిణ మధ్య రైల్వేజోన్ పరిధిలో 1.15గంటలు నియంత్రణ చేశారు.
- నిజాముద్దీన్ నుంచి కేఎస్సార్ బెంగళూర్ సిటీ మధ్య రాకపోకలు సాగించే రాజధాని సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను దక్షిణ మధ్య రైల్వేజోన్ పరిధిలో 20నిమిషాలు నియంత్రణ చేయనున్నారు.
- చెన్నయ్ సెంట్రల్ నుంచి న్యూఢిల్లీ వెళ్లే తమిళనాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో గంటసేపు నియంత్రిస్తారు.
- విశాఖపట్నం నుంచి న్యూఢిల్లీ వెళ్లే ఆంధ్రప్రదేశ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో 45నిమిషాలు నియంత్రణ చేయనున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- సామాజిక ఆరోగ్య కేంద్రం పరిశీలన



ఆసుపత్రిలో పర్యటిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

లక్సెట్టిపేట: వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం ఆయన లక్సెట్టిపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. వార్డులు, ల్యాబ్, రిజిష్టర్లు, పరిసరాలు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అవసరమైన మందుల నిల్వలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలను సందర్శించి తరగతి గదులు, భోజనశాల, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, సకాలంలో వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన పరీక్షలు చేసి వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, అధికారులతో కలిసి వసతిగృహాలు, తనిఖీలు, విద్యార్థుల ఆరోగ్యం, మెనూ అమలు, పారిశుద్ధ్యం, భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. సీఎంఆర్ లక్ష్యం వేగవంతం, రైస్‌మిల్లుల తనిఖీలు, రేషన్‌కార్డుల పంపిణీ చేయాలని తెలిపారు. భూభారతి దరఖాస్తులను ఆగస్టు 15 నాటికి పరిష్కరించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్యతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, తనిఖీలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ నెల 25నుంచి వచ్చే నెల 10 వరకు జిల్లాలో రేషన్‌కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్యం హుళక్కేనా..!

- వైద్యం చేస్తే తప్పని ఫీజు రికవరీ
- గందరగోళ పరిస్థితుల్లో బాధితులు



మందమర్రిరూరల్: సింగరేణిలో మూడు నాలుగు దశాబ్దాలపాటు సేవలందించి విరమణ పొందిన ఉద్యోగులకు సింగరేణి ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందకుండా పోయింది. ఉద్యోగులకు ఉచిత వైద్యం అందిస్తూ రిటైర్డు ఉద్యోగులను విస్మరిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీపీఆర్ఎంఎస్ కార్డు నుంచి ఫీజు రికవరీ చేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలపాటు సేవలందించిన రిటైర్డు ఉద్యోగులు పింఛన్‌తో జీవనం సాగిస్తున్నారు. ఏదైనా జబ్బు పడితే కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యానికి భరోసాగా రూ.8లక్షల విలువైన సీపీఆర్ఎంఎస్ కార్డును సింగరేణి యాజమాన్యం అందజేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. చిన్నపాటి అనారోగ్యానికి గురై ఆర్కేపీ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందితే సీపీఆర్ఎంఎస్ కార్డు నుంచి రికవరీ చేస్తున్నారు. రిటైర్డు కార్మికుడు ఒకరు మే నెలలో విరేచనాలతో మందమర్రి ఏరియాలోని డిస్పెన్సరీకి వెళ్లాడు. అక్కడ తగ్గకపోవడంతో రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఉచితంగా వైద్యం అందించాల్సి ఉండగా.. అక్కడ 24గంటలు వైద్యం అందించినందుకు గాను మందులు, పరీక్షలు, వార్డు చార్జీలు, డైట్ చార్జీలు కలిపి రూ.4,368 బిల్లు వేసి సీపీఆర్ఎంఎస్ కార్డు నుంచి రికవరీ చేసుకున్నట్లుగా మే 28 సమాచారం వచ్చింది. ఈ విషయమై రామకృష్ణాపూర్ డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ప్రసన్నకుమార్‌ను సంప్రదించగా.. తాను కొత్తగా వచ్చానని, కొత్తగూడెంలోని చీఫ్ మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకోవాలని చెప్పారు.

ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం చేయాలి



సింగరేణి రిటైర్డు ఉద్యోగులకు సింగరేణి ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించాలి. ఎవరికైనా రికవరీ చేసినట్లయితే తనను సంప్రదించాలి. రికవరీ డబ్బులు ఇప్పిస్తా. సీపీఆర్ఎంఎస్ కార్డులో ఎంతవరకు వైద్యం కోసం రికవరీ అయింది.. ఇంకా ఎంత బ్యాలెన్స్ ఉందనే విషయాన్ని తెలియజేసే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలి.

– జనక్‌ప్రసాద్, రాష్ట్ర కనీస వేతనాల మండలి సలహా సభ్యులు, ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సెక్రెటరీ జనరల్

సీఐఎస్ఎఫ్ జవాన్లకు శిక్షణ



మాట్లాడుతున్న కమాండెంట్ చంచల్ సర్కార్

జైపూర్: భారత సైన్యంతో కలిసి ఇంటెన్సివ్ శిక్షణ చేపట్టినట్లు సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ చంచల్ సర్కార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేజింగ్ సెక్యూరిటీ థ్రెట్స్ మధ్యలో సీఐఎస్ఎఫ్ సంసిద్ధతను బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ ప్రారంభమైందని తెలిపారు. ఈ శిక్షణ కశ్మీర్ లోయలో సాగుతుండగా, రాత్రి ఆపరేషన్లు, జంగిల్ వార్‌ఫేర్, క్లోజ్ కంబాట్, ఓర్పు శిక్షణ వంటి కీలక అంశాలపై దృష్టి సారించారని పేర్కొన్నారు. క్విక్ రియాక్షన్ టీమ్(క్యూఆర్‌టీ) నుంచి అత్యంత అర్హులైన యువతనే ఎంపిక చేశామని, వారి వయస్సు 35 లోపు ఉండేలా చూస్తున్నామని తెలిపారు. ఎస్ఎస్‌జీ ప్రమాణాలకు అనుగుణంగా ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరిగా ఉండాలని వివరించారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఇప్పటికే ఇంటెన్సివ్ ఇన్ హౌస్ శిక్షణ పూర్తి చేశారని, వారు డ్రోన్ దాడులు, ఉగ్రవాద చర్యలు, అంతర్గత బెదిరింపులపై సమర్థంగా స్పందించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నారని తెలిపారు. భవిష్యత్‌లో ఇతర యూనిట్లకు కూడా ఈ శిక్షణ విస్తరించే ప్రణాళిక ఉందన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

మంచిర్యాలటౌన్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాలలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌తో కలిసి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ స్థానిక సమస్యలపై దృష్టి సారించి పోరాటం చేయాలన్నారు. ప్రతీ మండలానికి ఒక ఎన్నికల ప్రభారీ, కన్వీనర్ నియామకానికి పార్టీ సూచించిందని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకుడు గోమాసే శ్రీనివాస్, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, స్థానిక ఎన్నికల జిల్లా ప్రభారీ ఎడ్ల అశోక్‌రెడ్డి, నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, పర్వతాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాజీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ సురేఖ పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. మంగళవారం ఆయన జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బందితో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవు రోజుల్లోనూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. రౌండ్ ది క్లాక్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రి విధులు నిర్వహించే వైద్య సిబ్బంది వివరాలు గోడపై అతికించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కృపాబాయి, సుధాకర్ నాయక్, అనిత, ప్రసాద్, సీతారామరాజు, ప్రశాంతి, శివప్రతాప్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

సరిపడా యూరియా అందుబాటులో ఉంది



కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయాధికారి ఛత్రునాయక్, అధికారులు, రైతులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులకు సరిపడా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయాధికారి ఛత్రునాయక్ అన్నారు. మంగళవారం ముల్కల్ల రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతునేస్తం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని రైతాంగానికి అవసరమైన యూరియాను మార్క్‌ఫెడ్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతు ఆధార్ కార్డుతో ఈ-పాస్ మెషిన్ ద్వారా యూరియా కొనుగోలు చేయాలన్నారు. వరి పంటకు 60-70 కిలోల యూరియా, ఒక బస్తా పొటాష్, ఒక బస్తా డీఏపీని మూడు దఫాలుగా ప్రతీ 30 రోజులకు ఓసారి పంటకు వేసుకోవాలని తెలిపారు. ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని తెలిపారు. రైతులు అంతర పంటగా పొలం గట్ల వెంట కంది పంట, కూరగాయల సాగు చేస్తే అదనపు ఆదాయం సమకూరుతుందని అన్నారు. వరి, పత్తి పంటలు కాకుండా పప్పు దినుసుల సాగు చేయాలని, జిల్లాలోని రైతులు సబ్సిడీ ఉన్న ఆయిల్ పామ్ పంట సాగుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ అనిత, ఏఓ కృష్ణ, ఆత్మ డైరెక్టర్ కుమార్‌యాదవ్, ఫర్టిలైజర్ డీలర్స్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్లు విక్రేత అరెస్ట్



కల్లు, నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్/తలమడుగు: 'వామ్మో కల్లు' శీర్షికన ఈనెల 16న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. సోమవారం ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన ముత్యంపేట బాబాగౌడ్ వద్ద హానికర రసాయనాలు కలిపిన సుమారు 40లీటర్ల తెల్లకల్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. ఎవరైనా తెల్లకల్లులో క్లోరల్‌హైడ్రేట్, ఇతర హానికర రసాయనాలు కలిపి విక్రయిస్తే కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అక్బర్ హుస్సేన్ తదితరులున్నారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు

బాసర: నిజామాబాద్ జిల్లా సిర్పూర్ మండలానికి చెందిన గంగామణి అనారోగ్యంతో బాధ పడుతూ జీవితంపై విరక్తి చెంది మంగళవారం నిర్మల్ జిల్లా బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించింది. అక్కడే ఉన్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్, హోంగార్డు గణేశ్ గమనించి ఆమెను అడ్డుకున్నారు. అనంతరం ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. గంగామణికి కౌన్సెలింగ్ ఇచ్చి ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు.

రౌడీషీటర్ అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడకు చెందిన దిలీప్‌సింగ్ షెకావత్ అనే రౌడీషీటర్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఇటీవల పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోలీసు విధులకు ఆటంకం కలిగించడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న మహిళ

చెన్నూర్: చెన్నూర్ జాతీయ రహదారి సమీపంలో గతంలో తమ తాతలకు ప్రభుత్వం ఇచ్చిన ఇనాం భూమిలో ఇసుక బజార్ ఏర్పాటు చేస్తున్నారని పట్టణానికి చెందిన మహిళ నిమ్మల రాంబాయి పురుగుల మందు డబ్బాతో మంగళవారం ఆందోళన చేపట్టింది. ఈ విషయం తహసీల్దార్‌కు తెలిపినా పట్టించుకోలేదని ఆరోపించింది. మంత్రి స్పందించి తమ భూమి ఇప్పించాలని, లేనిపక్షంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది.

ద్విచక్రవాహనం చోరీ



అనుమానితుల ఫొటో

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సులభ్ కాంప్లెక్స్ ఎదుట నిలిపి ఉన్న మంచిర్యాలకు చెందిన శ్రీనివాస్ ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు. సీసీ పుటేజీలో కనిపించిన అనుమానితుల ఫొటోలను వారు విడుదల చేశారు. నిందితుల ఆచూకీ తెలిసినవారు 87126 56534, 87126 56535 నంబర్లలో సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

పుట్టినరోజే చివరిరోజు

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



శశికాంత్ (ఫైల్)

బోథ్: పుట్టినరోజే ఆ యువకుడికి చివరి రోజైంది. ఎస్సై శ్రీసాయి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మల్యాల శశికాంత్ (24) కారులో బోథ్‌కు వస్తుండగా పొచ్చెర క్రాస్ రోడ్డు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శశికాంత్ బండరాయిపై పడగా ఛాతిలో బలమైన గాయమైంది. కారులో ప్రయాణిస్తున్న ఓ యువతికి కూడా గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో వారిద్దరినీ బోథ్‌లోని సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శశికాంత్‌ను రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆనందంగా పుట్టినరోజు జరుపుకోవాల్సిన శశికాంత్ మృతి ఆ కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'నవోదయ'లో క్రీడా సంగ్రామం



వివిధ జిల్లాల నుంచి జవహర్ నవోదయ విద్యాలయానికి చేరుకున్న క్రీడాకారులు

- నేటి నుంచి పోటీలు ప్రారంభం
- తొమ్మిది ఉమ్మడి జిల్లాల నుంచి పాల్గొనేందుకు క్రీడాకారుల రాక
- కాగజ్‌నగర్‌లో ఏర్పాట్లు పూర్తి

కాగజ్‌నగర్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పోటీల్లో రాష్ట్రంలోని ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్, ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల జవహర్ నవోదయ విద్యాలయాల క్రీడాకారులు హాజరు కానున్నారు. పోటీల్లో హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్, వాలీబాల్ క్రీడలు నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనే వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు మంగళవారం కాగజ్‌నగర్ జవహర్‌నవోదయ విద్యాలయానికి చేరుకున్నారు. అండర్-14, 17, 19 విభాగాల్లో జరిగే పోటీల్లో ఒక్కో గేమ్‌కు ఆరు టీంలుగా 18 జట్లు పాల్గొననున్నాయి. పోటీల్లో విజయం సాధించిన వారు ఈ నెల 29, 30, 31తేదీల్లో కేరళతోపాటు రంగారెడ్డి, విజయనగరం జిల్లాల్లో జరిగే రీజినల్ పోటీల్లో పాల్గొననున్నారు. రీజినల్ లెవల్‌లో గెలుపొందిన క్రీడాకారులు ఆగస్టు 21, 22, 23 తేదీల్లో గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో జరిగే వాలీబాల్, బిహార్‌లోని నలందలో జరిగే హ్యాండ్‌బాల్, మధ్యప్రదేశ్‌లోని గుణలో జరిగే బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారు.

శిక్షణ పొంది వచ్చాను



వికారాబాద్ జవహర్ నవోదయ విద్యాలయంలో మా అధ్యాపకులు క్రీడల్లో శిక్షణ ఇచ్చారు. 2023లో నాకు మధ్యప్రదేశ్, బిహార్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న అనుభవం ఉంది. ఈసారి నేషనల్ లెవల్‌లో విజయం సాధించడమే లక్ష్యంగా పోటీల్లో పాల్గొంటున్నా.

– జోనాథన్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు, రంగారెడ్డి

తప్పకుండా విజయం సాధిస్తా



నేషనల్ లెవల్‌లో విజయం సాధించడమే లక్ష్యంగా ఈ పోటీల్లో పాల్గొంటున్నాను. గతంలో నేను ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన నేషనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాను. ఈ సారి నేషనల్ స్థాయి కప్ సాధించడమే లక్ష్యంగా పోటీల్లో పాల్గొంటున్నాను.

– బేగరి హర్షిత్, వాలీబాల్ క్రీడాకారుడు, మహబూబ్‌నగర్

నేషనల్ లెవల్‌లో ఆడాను



నవోదయ విద్యాలయాల్లో నిర్వహించిన కీడ్రా పోటీల్లో రాణించి నేషనల్ లెవల్‌లో గెలుపొందాలని ఉంది. గతేడాది ఎస్జీఎఫ్ఐ నేషనల్ లెవల్‌లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నాను. క్రీడల్లో రాణించి నేవీ ఆఫీసర్‌గా సేవలందిస్తా.

– బూస పల్లవి, హ్యాండ్‌బాల్ క్రీడాకారిణి, కరీంనగర్

పోటీల్లో సత్తా చాటుతా



గతేడాది నవోదయ విద్యాలయాల పరిధిలో నిర్వహించిన క్లస్టర్, రీజినల్ స్థాయి పోటీల్లో గెలుపొందాను. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన నేషనల్ లెవల్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను. ఇక్కడ ఏర్పాట్లు బాగున్నాయి. స్పోర్ట్స్ కోటాలో రాణించి పోలీస్ ఆఫీసర్ కావాలనే ఆశ ఉంది.

– శ్రీపల్లవి, హ్యాండ్‌బాల్ క్రీడాకారిణి, మహబూబ్‌నగర్

ఏర్పాట్లు పూర్తి చేశాం



పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన బాలబాలికల కోసం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశాం. సరిపడా సౌకర్యాలు కల్పించాం. పోటీల విజయవంతానికి కృషి చేస్తున్నాం. క్లస్టర్ స్థాయి పోటీలు ఇక్కడ నిర్వహించడం ఆనందంగా ఉంది.

– రేపాల కృష్ణ, జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్, కాగజ్‌నగర్

డిపాజిట్ సొమ్ము చెల్లించాలని ఆందోళన



సహారా కార్యాలయం ఎదుట డిపాజిటర్లు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని సహారా ఇండియా కార్యాలయం ఎదుట డిపాజిట్‌దారులు మంగళవారం ప్లకార్డులు ప్రదర్శించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి విశ్రాంత కార్మికులు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్‌లు, అసంఘటిత రంగంలో పనిచేసే కూలీలు ఎంతో కష్టపడి సంపాదించిన డబ్బులు సహారాలో డిపాజిట్ చేసినట్లు తెలిపారు. డిపాజిట్‌లు మెచ్యూరిటీ పూర్తయి ఏళ్లు గడుస్తున్నా తమకు డబ్బులు చెల్లించడం లేదని వాపోయారు. సహారా డిపాజిట్‌లను చెల్లించేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. సహారా బాధితుల సంఘం నాయకులు గజెల్లి వెంకటయ్య, దండు రాజమౌళి, జీ ప్రభాకర్, ఎం.కాంతయ్య, పీ చంద్రకాంత్, ఎస్.భీమేశ్, బాలు పాల్గొన్నారు.

'గిరి' గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. మంగళవారం తన చాంబర్‌లో అడిషనల్ డీఎంహెచ్‌వో సమక్షంలో గిరిజన ప్రాంత పరిధిలోని 32 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్లకు జూమ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాగులు వంకలతో రోడ్లు తెగిపోనున్న గ్రామాల్లోని గర్భిణులను ముందస్తుగా గుర్తించి వారిని సురక్షితంగా ప్రసూతి కోసం దగ్గరలోని బర్త్ వెయిటింగ్ రూమ్‌లకు లేదా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు తరలించాలన్నారు. వారు ప్రసూతి సమయంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు. మలేరియా, డెంగీ బారిన పడకుండా గ్రామగ్రామాన రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించి వెంటనే చికిత్స ఇవ్వాలని ఆదేశించారు. అన్ని ఆశ్రమ పాఠశాలల్లో బాలబాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి చికిత్స అందించాలని సూచించారు. మారుమూల ప్రాంతాల్లోని పీవీటీజీ గ్రామాలను సందర్శించి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులుంటే ఉన్నతాధికారులను వెంటనే సమాచారం ఇవ్వాల్సిందిగా సూచించారు. నాలుగు జిల్లాల డీఎంహెచ్‌వోలు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, ఉమ్మడి జిల్లాల మెడికల్ ఆఫీసర్లు, అధికారులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు ఏడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ ఓ వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జైనథ్ మండలం బాలాపూర్ గ్రామానికి చెందిన శనగారపు రవి (43) 2022 మే 15న ద్విచక్ర వాహనంపై బాలాపూర్ వైపు వెళ్తున్నాడు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ బల్జిందర్ సింగ్ మద్యం తాగి అతివేగంగా రవి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రవి రెండు కాళ్లతో పాటు తలకు తీవ్ర గాయాలు కాగా, రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వాహన డ్రైవర్‌ను అరెస్ట్ చేసి డ్రంకెన్ డ్రైవ్ టెస్టు చేయగా మద్యం తాగినట్లు తేలింది. అప్పటి ఎస్సై పెర్సిస్ కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ పోలీస్ అధికారి జమీర్ 15 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ నహీం సుల్తానా నేరం రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి వివరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



భీమన్న మృతదేహం

దిలావర్‌పూర్: మండలంలోని మాయాపూర్ గ్రామానికి చెందిన కామిండ్ల భీమన్న (40) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భీమన్న వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల కిందట తన పెద్ద కూతురు వివాహం చేశాడు. వివాహం కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలని భార్య సునీతతో చెబుతూ బాధపడేవాడు. అప్పులు తీర్చే మార్గం లేక సోమవారం పంట చేనుకు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగాడు. భీమన్న రాత్రయినా ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు పంట చేను వద్దకు వెళ్లి చూడగా పురుగుల మందు తాగి ఉండడాన్ని గమనించారు. వెంటనే అతడిని నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. భీమన్నకు మరో కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆసరాగా ఉంటాడనుకుంటే అనంత లోకాలకు..

- విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



మేకల సురేశ్ (ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: కుటుంబ పోషణకు తల్లిదండ్రులకు ఆసరాగా ఉన్న కుమారుడిని విద్యుత్‌షాక్ రూపంలో మృత్యువు కబళించింది. తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్న ఆ యువకుడు అనంత లోకానికి వెళ్లడంతో ఆ కుటుంబం కన్నీటి పర్యంతమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి పంచాయతీ పరిధి జీడిచేను గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్–సుజాత దంపతులకు ఇద్దరు కూతుళ్లతోపాటు కుమారుడు సురేశ్ (22) ఉన్నారు. సురేశ్ పట్టణంలోని ఓ కిరాణా షాపులో పని చేస్తున్నాడు. శ్రీనివాస్ ఎస్పీఎంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తుండగా, సుజాత కూలీ పనులకు వెళ్తోంది. సురేశ్ మంగళవారం మధ్యాహ్నం ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్ రిపేర్ చేస్తూ ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటికి వచ్చిన తండ్రి శ్రీనివాస్‌కు కుమారుడు విగత జీవిగా కనపించగా కన్నీరుమున్నీరయ్యాడు. తలకొరివి పెడుతాడనుకున్న కొడుకుకే తాము దహన సంస్కారాలు చేయాల్సి వస్తున్నందుకు ఆ తల్లిదండ్రులు రోధించిన తీరు పలువురిని కలిచివేసింది. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళకు పదేపదే ఫోన్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు మావల సీఐ స్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ స్థలంలో నిందితుడు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన మహిళ ఫోన్ నంబర్ రాశాడు. దీంతో ఆదిలాబాద్ పట్టణంలోని మసూద్‌నగర్‌కు చెందిన ఎస్కే అటల్ అమర్, నిర్మల్ జిల్లాకు చెందిన రాంప్రసాద్, నిజామాబాద్‌కు చెందిన బచోల గంగాధర్ పదేపదే ఆ నంబర్‌కు ఫోన్ చేసి సదరు మహిళను వేధించారు. ఆమె ఎంత బతిమిలాడినా, వారి నంబర్లు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టినా వినకుండా ఇతర నంబర్ల నుంచి ఫోన్ చేశారు. దీంతో ఆమె షీ టీంను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు మావల పోలీస్‌స్టేషన్‌లో నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే షీ టీంను సంప్రదించాలని, వారికి పూర్తిస్థాయిలో అండగా ఉంటామని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పిడుగుపాటుకు ఒకరు మృతి



చాప్లె ఎమ్మాజీ (ఫైల్)

కౌటాల: మండలంలోని తలోడి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం పిడుగు పాటుకు ఒకరు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. తలోడి గ్రామానికి చెందిన చాప్లె ఎమ్మాజీ (50) తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి ఉదయం పత్తి చేనుకు వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి ఎడ్లబండిపై ఇంటికి వస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో ఎడ్లబండిపై పిడుగుపడింది. ఈ ప్రమాదంలో ఎమ్మాజీ ఎడ్లబండిపై అక్కడికక్కడే మృతి చెందగా అతడి భార్య అంజలి, కుమారులు అజయ్, అరుణ్ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన అజయ్‌ను సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తరలించారు. తల్లి అంజలి, అరుణ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిపాల్ (45) మృతి చెందినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముధోల్ మండలం ముద్గల్ గ్రామానికి చెందిన మహిపాల్ పని నిమిత్తం భైంసాకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. భైంసా నుంచి బాసర వైపు వెళ్తున్న కారు దేగాం గ్రామ సమీపంలోని కుంట చెరువు వద్ద మహిపాల్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహిపాల్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటి స్థలాన్ని ఆక్రమించిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీలో సర్వే నంబర్ 68లో గల 318 నంబర్ ప్లాట్‌ను ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపట్టిన ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ స్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కేఆర్‌కే కాలనీకి చెందిన మహ్మద్ అబ్దుల్ వసీమ్, ఆయన తల్లి షేక్ సలీమా బేగం పేరిట గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. దీంతో ఆమె అక్కడ ఇంటి నిర్మాణం చేపట్టింది. 2024లో కేఆర్‌కే కాలనీకి చెందిన మోర విజయలక్ష్మి, జాంజిరాల వరలక్ష్మి, రవి ఆ ఇల్లును కూల్చివేసి నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్ కబ్జా చేశారు. అంతేకాకుండా అక్కడ కొత్త ఇంటి నిర్మాణం చేపట్టారు. దీంతో మహ్మద్ అబ్దుల్ వసీమ్ ఈనెల 20న పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మంగళవారం నిందితుడు రవిని అరెస్టు చేయగా, మిగతా ఇద్దరు పరారీలో ఉన్నట్లు వివరించారు.

ఉమ్మడి జిల్లా మహిళలకు రూ. 348 కోట్లు ఆదా

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మహిళా ప్రయాణికులకు మహాలక్ష్మి పథకం ప్రారంభమైన 2023 డిసెంబర్ 9నుంచి ఇప్పటిదాకా రూ.348.80 కోట్లు ఆదా అయినట్లు ఆర్టీసీ ఆర్ఎం ఎస్.భవానీప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 10.39 కోట్ల మంది ఉచిత ప్రయాణం చేసినట్లు వివరించారు. అత్యధికంగా నిర్మల్ డిపో పరిధిలో 2.71 కోట్లు, మంచిర్యాలలో 2.20 కోట్లు, ఆదిలాబాద్‌లో 1.75, ఆసిఫాబాద్‌లో 1.62, భైంసా పరిధిలో 1.59 కోట్లు, ఉట్నూర్ డిపో పరిధిలో 52 లక్షల మంది ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం రీజియన్ పరిధిలో మహాలక్ష్మి పథకం సంబరాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

హెచ్ఎంఎస్ అధ్యక్షుడిగా సారయ్య



తిప్పారపు సారయ్య

శ్రీరాంపూర్: సింగరేణి మైనర్స్ అండ్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా తిప్పారపు సారయ్యను ఎన్నుకున్నారు. ఈనెల 19న గోదావరిఖనిలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో సారయ్యను ఎన్నుకున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రియాశీలకంగా పనిచేస్తూ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తున్న సారయ్యను అధ్యక్షుడిగా ఎన్నుకోవడంపై యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, నాయకులు అశోక్, గోళ్ల సత్యనారాయణ తదితరులు హర్షం వ్యక్తంజేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి రవి

కోటపల్లి: చట్టాలపై విద్యార్థి దశనుంచే అవగాహన కలిగి ఉండాలని చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జి రవి సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో చట్టాలపై అవగాహన, బాల్యవివాహాల నిరోధక చట్టంపై కేజీబీవీ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. సివిల్ అండ్ క్రిమినల్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోక్సో పీపీ రాంబావు, సీఐ బన్సీలాల్, ఎస్సై రాజేందర్, అడ్వకేట్ మహేశ్, పున్నం పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరగా ఇవ్వాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో రిటైర్డయిన కార్మికుల బెనిఫిట్స్ త్వరగా సెటిల్ చేయాలని ఏరియా డీజీఎం (పర్సనల్) ఎస్.అనిల్‌కుమార్ సూచించారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏరియా పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సంక్షేమాధికారులతో సమీక్ష నిర్వహించారు. జాప్యం లేకుండా కారుణ్య నియామకాలను వేగవంతం చేయాలని తెలిపారు. డీవైపీఎం దేవేందర్‌రెడ్డి, సంక్షేమాధికారులు మురళి, సంతన్, ఎస్.సురేందర్, పాల్ సృజన్, హరికృష్ణ, అజ్మీరా రమేశ్, వెంకన్న, ఓంకార్‌బాబు ఉన్నారు.

బాలుడి ప్రాణాలు తీసిన శనిగలు

- గొంతులో ఇరుక్కుని ఊపిరాడక మృతి
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన



రిషి (ఫైల్)

కౌటాల(సిర్పూర్): తన ముద్దుల కొడుకు ఇష్టంగా తింటాడని కొనితెచ్చిన శనిగలే ఆ తల్లికి గుండెకోత మిగిల్చాయి. అప్పటివరకు సంతోషంగా ముచ్చటిస్తూ తల్లిదండ్రులతో గడిపిన నాలుగేళ్ల బాలుడు శనిగలు గొంతులో ఇరుక్కుని ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. ఈ హృదయ విదారక ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. కౌటాల మండలం కనికి గ్రామానికి జాడి ప్రకాశ్, కళ్యాణి దంపతులకు కుమారుడు రిషి (4) ఉన్నాడు. ప్రకాశ్ కుటుంబంతో కలిసి కౌటాల మండల కేంద్రంలో అద్దె ఇంట్లో ఉంటూ స్థానిక ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. అదే పాఠశాలలో రిషి నర్సరీ చదువుతున్నాడు. కళ్యాణి సోమవారం కౌటాల వారసంత నుంచి పది రూపాయలకు వేయించిన శనిగలు కొని ఇంటికి తెచ్చింది. సాయంత్రం వాటిని తింటుండగా రిషి గొంతులో ఇరుక్కుని ఊపిరాడక అల్లాడిపోయాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే కౌటాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు ప్రైవేట్ అంబులెన్స్‌లో అర్ధరాత్రి మంచిర్యాలకు తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు మంచిర్యాలలోని వైద్యులు నిర్ధారించారు. మంగళవారం ఉదయం రిషి మృతదేహాన్ని స్వగ్రామం కనికి గ్రామానికి తీసుకువచ్చారు. 'శని'లా శనిగలు పొట్టన పెట్టుకున్నాయని కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహంపై పడి రోదించారు. సాయంత్రం గ్రామ సమీపంలో బాలుడి అంత్యక్రియలు నిర్వహించారు.

నకిలీ బంగారం ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

సోన్: జల్సాల కోసం నకిలీ బంగారు ఆభరణాలు తయారు చేసిన ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ రాజేశ్ మీనా తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం సోన్ పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా సంగం మండలం రాళ్లచెలిక గ్రామానికి చెందిన కర్రెద్దుల మల్యాద్రి, అతడి భార్య సుభాషిని గాంధీనగర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రూ.2లక్షలకు నకిలీ బంగారం విక్రయించారు. మంగళవారం పోలీసులు వారిద్దరినీ అరెస్ట్ చేశారు. రూ.20వేల నగదు, రూ.30 వేల విలువైన కలర్ టీవీ, రూ.5వేల విలువైన నకిలీ బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వారిని పట్టుకున్నందుకు రాజేశ్, గోవర్ధన్‌రెడ్డి, ఎస్సై గోపి, పోలీసులను ఏఎస్పీ రాజేశ్ మీనా అభినందించారు.

ఆదివాసీలకు అండగా ప్రభుత్వం



చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

దండేపల్లి: ఆదివాసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి పేర్కొన్నారు. జీవో 49 నిలుపుదల సందర్భంగా మండలంలోని తాళ్లపేటలో ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. కుమురం భీమ్ కన్జర్వేషన్‌గా ప్రకటిస్తూ తీసుకు వచ్చిన జీవో 49తో ఆదివాసీ గిరిజనులు ఆందోళన చెందారని తెలిపారు. దీంతో ప్రభుత్వం ఆలోచించి జీవో నిలుపుదల చేసి ఆదివాసీలకు ప్రభుత్వంపై ఉన్న ప్రేమను చాటుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సేనా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు కన్నాక జంగు, ఆదివాసీ సంఘాల నాయకులు లచ్చుపటేల్, కాంతారావు, సోము, జంగు, రమేశ్, రాజం, లాల్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఓరియంట్ ఎన్నికలపై తేలని నిర్ణయం

కాసిపేట: దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి కార్మిక శాఖ ఇంకా నిర్ణయం ప్రకటించలేదు. దీంతో కార్మిక శాఖ తీరును వ్యతిరేకిస్తూ హైకోర్టులో ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ వేసిన కేసులో పలుసార్లు హైకోర్టు సూచించినా కార్మికశాఖ అధికారులు సాగదీస్తూ.. దాటవేస్తూ వస్తున్నారు. గుర్తులు కేటాయించి ఎన్నికల తేదీ, షెడ్యూల్ ప్రకటించకపోవడంతో కోర్టు మంగళవారం ప్రక్రియ ప్రారంభించి వివరాలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించింది. డీసీఎల్ సెలవులో ఉన్నట్లు అధికారులు కోర్టుకు తెలుపగా కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒక్క రోజులో ఎన్నికల తేదీ తెలపాలని చెప్పడంతో అధికారులు వారం గడువు కోరారు. దీంతో రెండు రోజులు గడువు ఇచ్చి గురువారం షెడ్యూల్ ప్రక్రియ ప్రారంభించి వివరాలు అందించాల్సిందిగా కోర్టు ఆదేశించినట్లు తెలిసింది. అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు ఉండగా జాప్యం చేస్తూ స్థానిక ఎన్నికల వరకు సాగదీయాలని చూస్తున్నట్లు సమాచారం. కోర్టు ఆదేశాలు అమలవుతాయా? అధికారుల పన్నాగమే పైచేయి అవుతుందా? అనేది చర్చనీయాంశమైంది. స్థానికంగా ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు గ్రూపులుగా వివాదాలు పెరిగే అవకాశముంది.